సంక్షేమంలో సరికొత్త అధ్యాయం

- నిరుపేదలకు అండగా సీఎం జగనన్న
- మంత్రి జోగి రమేష్
- పెడన, గూడూరు, మల్లవోలులో సామాజిక పెన్షన్ల పంపిణీ


పెడనలో పింఛన్లను పంపిణీ చేస్తున్న మంత్రి జోగి రమేష్:


మల్లవోలులో సామాజిక పెన్షన్ల నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

గూడూరు: నిరుపేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా సంక్షేమంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పెరిగిన సామాజిక పెన్షన్ల పంపిణీతో పాటు గూడూరు మండలంలో కొత్తగా మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం పెడన, గూడూరు, మల్లవోలు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని సీఎం జగనన్న భావించారని చెప్పారు. అందుకే దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు గూడూరు మండలంలోని 8,579 మందికి సామాజిక పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కొత్తగా మండలంలో 150 మందికి పెన్షన్లు మంజూరు చేశారని చెప్పారు. ఒక్క గూడూరు మండలంలోనే ప్రతి నెలా రూ.2 కోట్ల 53 లక్షల పైచిలుకు సామాజిక పెన్షన్ల రూపంలో పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి పేదవాడి కష్టాలు తీర్చుతున్న జగనన్నను నిండు మనస్సుతో ఆశీర్వదించి వచ్చే ఎన్నికలలో మళ్లీ అఖండ విజయం చేకూర్చాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, ఏపీఎస్‌ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, ఆర్బీకే చైర్మన్ మున్నా, పర్లం పెదబాబు, సర్పంచి లింగం సులోచనారాణి, ఎంపీడీఓ డి.సుబ్బారావు, తహసీల్దార్ బి.విజయప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మంచి చేస్తున్న సీఎం జగన్‌ను ఆదరించాలి

పెడన: సంక్షేమ పథకాల ద్వారా అన్నివర్గాలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆదరించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం పెడన మార్కెట్ యార్డు ఆవరణలో పెడన టౌన్‌కు సంబంధించి పెంచిన సామాజిక పెన్షన్లను పంపిణీ చేసి మాట్లాడారు. నిరుపేదలు ఆర్థికంగా ఎదిగేందుకు, పేదరిక నిర్మూలనకు కృషిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు నిండు మనస్సుతో దీవించాలని కోరారు. పెడన పట్టణ పరిధిలో కొత్తగా పింఛన్ మంజూరైన 43 మందితో కలిపి మొత్తం 4,576 మంది లబ్ధిదారులకు నెలకు 3 వేల చొప్పున రు.1,37,60,000 అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఎన్నడూ లేని విధంగా పెడన పట్టణ పరిధిలో 2,250 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించే కార్యక్రమం చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైస్ చైర్‌పర్సన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, జయేష్, గోపి, సతీష్, కరుణకుమారి, ఇన్‌చార్జి కమిషనర్ ఏసుబాబు, పెడన తహసీల్దార్ మధుసూదనరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లి, నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ద్విచక్ర వాహనాలు అందజేత


మత్స్యకారులకు ద్విచక్ర వాహనాలు, ఐస్ బాక్సులను అందజేసిన పేర్ని కిట్టు

మచిలీపట్నం టౌన్: మత్స్య సంపద యోజన పథకం ద్వారా లబ్ధిదారులైన మత్స్యకారులకు వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం ద్విచక్ర వాహనాలను, ఐస్ బాక్సుల యూనిట్‌లను అందజేశారు. నియోజకవర్గంలోని ఐదుగురు లబ్ధిదారులకు వీటిని స్థానిక మత్స్య శాఖ కార్యాలయం వద్ద అందజేశారు. కిట్టు మాట్లాడుతూ రూ. 75 వేల యూనిట్ విలువతో ఈ యూనిట్లను పంపిణీ చేశామన్నారు. ఎస్సీలకు 60 శాతం, మహిళలకు 60 శాతం, బీసీలకు 40 శాతం సబ్సిడీ లభిస్తుందని వివరించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

మండవల్లి: మండలంలోని కొర్లపాడులో ఉప సర్పంచ్ చందు రత్నకుమారి ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో వారి అనుభవాలు, అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తీసుకున్నారు.

పేదలకు ఆరోగ్య భరోసా

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


చల్లపల్లిలో మందులు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి


బంటుమిల్లిలో రోగిని పరీక్షించి మందులు రాస్తున్న వైద్యుడు

చల్లపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేసి ఆరోగ్యశ్రీని రూ. 5 లక్షల నుంచి 25 లక్షలకు పెంచారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక పడమరవైపు గ్రామ సచివాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని వివరించారు. శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, శానిటరీ అధికారి కలతోటి సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి), పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

మోపిదేవి: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మోపిదేవి ఆదర్శ పాఠశాలలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీని రూ. 5 లక్షల నుంచి 25 లక్షలకు పెంచి పేదలకు ఆరోగ్య భరోసా కల్పించారని వివరించారు. కూడు, గూడు, విద్య, వైద్యం ప్రతి పేదవాడికి అందిస్తున్న జగనన్నను మరోసారి దీవించాలని కోరారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ శ్రీలక్ష్మీ, డాక్టర్ హారిక, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ లక్ష్మీనాథ్, డాక్టర్ అనిల్‌కుమార్ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, సర్పంచ్ నందిగం మేరీరాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు రావి రాంప్రసాద్, ఆది రాంబాబు, కామిశెట్టి వెంకట సురేష్ బాబు, ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం స్వరూపరాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి రక్ష..

ఘంటసాల(అవనిగడ్డ): జగనన్న సురక్ష పేదల ఆరోగ్యానికి రక్ష అని ఎంపీడీఓ టి. అనూహ్య అన్నారు. ఘంటసాల మండల పరిధిలోని ఎండకుదురులో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. సర్పంచ్ ముళ్లపూడి పట్టాభి రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి. రామానాయక్, ఏఓ శ్రీనివాస్ చంద్, ఎంపీటీసీ కుమార్‌రాజా, కార్యదర్శి యార్లగడ్డ శివరాంప్రసాద్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

443 మందికి వైద్య పరీక్షలు..

బంటుమిల్లి: మండల పరిధిలోని ముంజులూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) ఫేజ్–2లో 443 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారని ఎంపీడీఓ జె. స్వర్ణభారతి తెలిపారు. సర్పంచ్ కూనపరెడ్డి సునీత అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీడీఓ మాట్లాడారు. బంటుమిల్లి వైద్యాధికారి పవన్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో వైద్య నిపుణులు ఋష్యంత్‌బాబు, మన్మితరెడ్డిలు పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఒడిమి చిన్నారిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం. రాజబాబు, కె. శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఇద్దరి అరెస్ట్



వివరాలు తెలుపుతున్న ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం

నాగాయలంక: మండలంలోని పర్రచివర శివారు బిల్లీ గ్రాహం నగర్ గ్రామంలో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బాప్టిస్ట్ చర్చి సమీపంలో శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. చాట్రగడ్డ ఏసోబు ఎలాంటి లైసెన్స్ లేకుండా అక్రమంగా మద్యం తరలిస్తుండగా కనుగొన్నారు. అతని నుంచి 12 క్వార్టర్ మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన మరోవ్యక్తి చిక్కాల సురేష్ తన హోటల్ వద్దకు ఎలాంటి లైసెన్స్ లేకుండా ఎనిమిది మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డాడు. వీరి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రారంభం


తాజ్‌మహల్ సెట్టింగ్ వద్ద పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ, కార్పొరేటర్లు

మచిలీపట్నం టౌన్: సంక్రాంతి పండుగ సమయంలో నగర ప్రజలకు ఎస్సార్ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ వినోదాన్ని పంచుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని హౌసింగ్ బోర్డ్ రింగ్ వద్ద ఏర్పాటు చేసిన ఎస్సార్ ట్రేడ్ ఫెయిర్ బిగ్ తాజ్ మహల్ ఎగ్జిబిషన్‌ను పేర్ని కిట్టు శుక్రవారం రాత్రి మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మతో కలిసి ప్రారంభించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ సంక్రాంతి సెలవుల్లో పిల్లలు, పెద్దలు ఆహ్లాదంగా, ఆనందంగా గడిపేందుకు ట్రేడ్ ఫెయిర్ దోహదపడుతుందన్నారు. వ్యాపారమే కాకుండా ప్రజలకు వినోదాన్ని అందించాలనే లక్ష్యంతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్లు మాసవరపు రాంప్రసాద్, జోగి చిరంజీవి, కో–ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, మట్టా తులసి, ఎగ్జిబిషన్ మేనేజర్ మోగిలి రాజు పాల్గొన్నారు.

పూజలు చేసి.. మొక్కుబడులు చెల్లించి


పైడమ్మను దర్శించుకున్న ఎంపీపీ వాణి, అచ్యుతరావు తదితరులు

పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి దేవస్థానంలో జాతర మహోత్సవాలు చివరి అంకానికి చేరుకున్నాయి. శుక్రవారంతో 11వ రోజుకు జాతర చేరుకోవడంతో భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, అచ్యుతరావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారితో పాటు దేవదాయ శాఖాధికారులు పర్యవేక్షించారు. స్థానిక భక్తులు శిడిబండ్లను కట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారిని శుక్రవారం అర్ధరాత్రి నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం ఉదయం ఊంజల సేవతో అమ్మవారి జాతర మహోత్సవాలు ముగుస్తాయి.

నేడు నూతన భవనాలు, గోడౌన్ ప్రారంభం

మోపిదేవి: మండలంలో నూతనంగా నిర్మించిన పలు భవనాలను, గోడౌన్‌ను శనివారం ఉదయం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, కేడీసీసీబీ చైర్మన్ తాతినేని పద్మావతి ప్రారంభిస్తారు. కె. కొత్తపాలెంలో శనివారం ఉదయం 10 గంటలకు గ్రామ సచివాలయ భవనం, కొక్కిలిగడ్డలో ఉదయం 10.30 గంటలకు మల్టీపర్పస్ గోడౌన్, మెరకనపల్లిలో ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయ భవనం, పీఏసీఎస్ కార్యాలయ భవనం, గోడౌన్‌ను ప్రారంభించనున్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

మచిలీపట్నం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా శుక్రవారం నగరంలో క్రికెట్ పోటీలు జరిగాయి. స్థానిక నోబుల్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీల్లో 10 జట్లు తలపడ్డాయి. పోటీలను చిలకలపూడి పాండురంగ మున్సిపల్ ఉన్నత పాఠశాల పీఈటీ రమేష్ కుమార్ పర్యవేక్షించారు.

కృత్తివెన్నులో ఎస్‌జీబీ బ్రాంచి ప్రారంభం

కృత్తివెన్ను: మండల పరిధిలోని కృత్తివెన్నులో సప్తగిరి గ్రామీణ బ్యాంక్ శాఖను చైర్మన్ ఏఎస్‌ఎన్ ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు బ్యాంకు ద్వారా మరిన్ని సేవలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ రీజనల్ మేనేజర్ నాయుడు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

● వేట.. ఆట





సాయం సంధ్య వేళ సూర్యాస్తమయం అవుతుండగా సూర్య కిరణాలు కృష్ణమ్మను తాకడంతో సువర్ణ శోభితమైంది. అదే సమయంలో సంచార జాతులకు చెందిన దంపతులు జీవనోపాధి కోసం నదిలో గాలం వేసి చేపలు చేపడుతుండగా వారి పిల్లలు కోతితో ఆడుకుంటూ ఉల్లాసంగా గడిపారు. మరోవైపు మత్స్యకారులు నావలపై చేపల వేటకు బయలుదేరారు. ఈ దృశ్యాలను కృష్ణానది తీరంలో శుక్రవారం సాయంత్రం 'సాక్షి' కెమెరాలో బంధించింది. –నాగాయలంక



విద్యార్థులకు బహుమతుల పంపిణీ


బహుమతి అందజేస్తున్న హరికుమార్, నాయకులు

గుడివాడరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదవే విద్యార్థుల విద్యాభివృద్ధికి శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో సహకారం అందిస్తామని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల (ఓల్డ్‌టౌన్)లో విద్యనభ్యసిస్తూ అత్యంత ప్రతిభ కనబర్చిన చిన్నారులకు ప్రతి నెలా అందజేసే ప్రోత్సాహక బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. శివ ఇంట రియల్ అధినేత మెరుగుమాల శివ సౌజన్యంతో చదువు, ఆట, పాటల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పుట్టి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమ శిక్షణతో విద్యనభ్యసిస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదుగుతారని, సమాజంలో విద్యద్వారానే గుర్తింపు లభిస్తుందని విద్యార్థులకు వివరించారు. యాదవ సంఘ నాయకులు పల్లపోతు వెంకట నాగబాబు, కంతేటి హరిబాబు, ప్రముఖుడు బొగ్గరపు తిరుపతయ్య, యాదవ సంఘ మహిళా కార్యదర్శి కుంభం నాగమణి, పాఠశాల హెచ్‌ఎం నాగమణి పాల్గొన్నారు.

పులిగడ్డలో రూ.2.04 లక్షలు సీజ్


పులిగడ్డలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ రమేష్

అవనిగడ్డ: మండల పరిధి పులిగడ్డలో సీఐ ఎల్. రమేష్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓ వాహనంలో రూ. 2.04 లక్షల నగదును గుర్తించారు. వాటికి సంబంధించి వివరాలు, రశీదులు లేకపోవడంతో సీజ్ చేసి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. జిల్లా ఎస్పీ పి. జాషువా ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో తనిఖీలు చేశామని ఆయన చెప్పారు.

జల్‌జీవన్ మిషన్ పనుల ప్రారంభం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు జగనన్న కాలనీలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.164.54 లక్షలతో మంచినీటి సరఫరా పైపులైన్లతో పాటు కుళాయిల ఏర్పాటుకు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక చేతుల మీదుగా శుక్రవారం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి ఉప్పాల రాము, పార్టీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, ఎంపీపీ కొడాలి సురేష్, కొండలమ్మ ఆలయ మాజీ చైర్మన్లు కనుమూరి రామిరెడ్డి, తాళ్లూరి మాధవ్, పీఏసీఎస్ అధ్యక్షుడు దుగ్గిరాల శేషుబాబు, శేషం గోపి, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకర్, సర్పంచులు కోటప్రోలు నాగు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం పెంపొందాలి

కోనేరుసెంటర్: ప్రతి ఒక్కరిలో వృత్తి నైపుణ్యం పెంపొందాలని కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్ వీరబ్రహ్మాచారి అన్నారు. కృష్ణా యూనివర్సిటీలో అవేర్నెస్ ఆన్ ప్రొఫెషనల్ బాడీస్ అంశంపై ఒక్క రోజు వర్క్ షాప్‌ను శుక్రవారం నిర్వహించారు. వీర బ్రహ్మాచారి మాట్లాడుతూ సాంకేతిక విద్యా విధానం, వృత్తి నైపుణ్యత, ఉద్యోగ బాధ్యతలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఢిల్లీకి చెందిన జాతీయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు టీఎస్‌ఎస్ బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మాత్రమే కాకుండా విద్యార్థులకు కూడా ఉపాధి, ఉద్యోగ, నైపుణ్య అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇది ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. కార్యక్రమానికి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమారి సమన్వయకర్తగా వ్యవహరించగా బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చల్లపల్లి: చల్లపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరాకు శనివారం ఉదయం అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ చల్లపల్లి మండల ఏఈఈ కన్నంరెడ్డి అరవింద్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్, పద్మావతి హాస్పిటల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

స్వామివారి సన్నిధిలో నాగిరెడ్డి



మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని వ్యవసాయ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవీవీఎస్ నాగిరెడ్డి కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ, బాలకృష్ణ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆలయ మర్యాదలతో కండువా కప్పి లడ్డూ ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ ఏసీ ఎస్‌ఎస్ చక్రధరరావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నందిగం మేరీరాణి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా



మోపిదేవి: రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శుక్రవారం పరిశీలించారు. మోపిదేవి జెడ్పీ పాఠశాలలో పోలింగ్ బూత్‌లను పరిశీలించి ప్రతి బూత్ వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని బీఎల్‌ఓలకు సూచించారు. తాగునీరు, విద్యుత్, ర్యాంపు, బాత్‌రూం తదితర మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. ఎంఆర్ఐ సునీల్, సీనియర్ అసిస్టెంట్ ఎం. శ్రీనివాసరావు, ఎస్‌ఐ వైవీవీ సత్యనారాయణ, వీఆర్వోలు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు లక్ష తులసి పూజ

గూడూరు: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గూడూరులోని మాధవ స్వామి దేవస్థానంలో ఆదివారం లక్ష తులసి పూజ నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కె. నవరంగ్ కిషన్ తెలిపారు. అర్చక స్వామి గంజాం సీతారామాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 5 గంటలకు స్వామి వారి సుప్రభాత సేవా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. రాత్రి 7 గంటల వరకు నిర్వహించే పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సంక్రాంతి సందడి



మోపిదేవి: పల్లెల్లో సంక్రాంతి సందడి ప్రారంభమైంది. డూడూ బసవన్నలు, గంగిరెద్దుల వారు ఇంటింటికీ వెళ్లి సందడి చేస్తున్నారు. గంగిరెద్దుల ఆటను చిన్నారులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఇళ్ల ముంగిళ్లలో పెద్ద పెద్ద ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణ నెలకొంది.

నేడు చెన్నూరులో గడప గడపకు మన ప్రభుత్వం

పెడన: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చెన్నూరు గ్రామంలో శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీఓ రెడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన



కృత్తివెన్ను: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంపై అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం పల్లెపాలెం పాఠశాలలోని పోలింగ్ బూత్ వద్ద ఈవీఎం, వీవీప్యాట్ వినియోగంపై అవగాహన కల్పించారు. అధికారులు ఓటర్లకు మాక్ పోలింగ్‌లో ఓటింగ్ విధానాన్ని తెలిపారు.